


# ఆధార్ అప్‌డేట్ గడువు పెంపు

**● మార్చి14 వరకు పొడిగింపు ● మార్పులు, చేర్పులకు అవకాశం**

న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, డిసెంబర్ 14 : ఆధార్ అప్‌డేట్ గడువును మరోసారి పొడిగించారు. వయసు పెరుగుతున్నకొద్దీ వ్యక్తుల ముఖాల్లో తేడాలు వస్తుండడం సర్వసాధారణం. కాగా, ఆధార్ కార్డు వివిధ అవసరాలకు ప్రామాణికమవుతోంది. దీంతో వ్యక్తులను గుర్తించడం కష్టమవుతుండగా, అటు అధికారులు, ఇటు ఆధార్ కార్డులోని వ్యక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటని పరిష్కరించే క్రమంలో ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పిస్తూ యూఐడీఏఐ అవకాశం కల్పించింది. గతేడాది డిసెంబర్ నుంచి మూడు మాసాల పాటు ఉచితంగా మార్పులు, చేర్పులు చేసుకోవచ్చంటూ ప్రకటించింది. అయితే కార్డుదారులు అంతగా ఆసక్తి కనబర్చకపోవడంతో ఆశించిన మేర మార్పులు చేసుకోలేదు. దీంతో ఈఏడాది మార్చి 14 నుంచి మరో మూడు నెలల పాటు అంటే జూన్ 14 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ప్రజల్లో కొద్దిమేర చైతన్యం రాగా, అప్‌డేట్ చేసుకునే వారి సంఖ్య క్రమేపి పెరిగింది. అయితే ఈలోపు గడువు సమీపించడంతో మరో మూడు మాసాలు పెంచుతూ ఈనెల 14వరకు అవకాశం కల్పించింది. అయినా, ఇంకా పదేళ్ల గడువు ముగిసిన వారు భారీ సంఖ్యలోనే ఉండడంతో మరోసారి మార్చి 14 వరకు గడువు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. గడువు ముగిసిన అనంతరం అప్‌డేట్‌తో పాటు ఫొటో, నివాసం, ఇతర మార్పులు, చేర్పులు చేసుకునేందుకు విధిగా రూ.50 చెల్లించాల్సి ఉంటుందని ఆధార్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

### ఉచితంగా ఆన్‌లైన్‌లో నమోదు

ఉచితంగా ఆన్‌లైన్ చేసుకునే విధానాన్ని ఒకసారి పరిశీలిస్తే.. ఉడాయ్ పోర్టల్‌లో https://myaadhaar.uidai.gov.in ఆధార్ నంబర్ ద్వారా లాగిన్ కావాలి. ప్రొసీడ్ టూ అప్‌డేట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఆధార్ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్‌చేసిన అనంతరం డాక్యుమెంట్ అప్‌డేట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. వివరాలు స్క్రీన్‌పై వస్తాయి. వాటిని పూర్తిగా పరిశీలించి, సవరణ ఉంటే చేయాలి. లేదంటే ఉన్న వివరాలతోనే నెక్ట్స్ పై క్లిక్ చేయాలి. కిందకు స్క్రోలింగ్ చేస్తే ప్రూఫ్ ఆఫ్ ఐడెంటిటీ, ప్రూఫ్ ఆఫ్ అడ్రస్ డాక్యుమెంట్లను ఎంచుకోవాలి. ఆయా డాక్యుమెంట్లను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలి. సబ్మిట్ బటన్‌పై క్లిక్ చేయాలి. పద్నాలుగు అంకెల అప్‌డేట్ రిక్వెస్ట్ నెంబర్ వస్తుంది. దీని ద్వారా స్టేటస్ తెలుసుకోవచ్చు.



మీసేవ సెంటర్‌లో అప్‌డేట్ చేసుకుంటున్న ప్రజలు




# ప్రకృతి ఒడిలో.. పాండవుల బండ

**పర్యావరణ ప్రేమికులను ఆకట్టుకుంటున్న గుట్టల అందాలు**
**వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వస్తున్న పర్యాటకులు**
**పండుగల సాయన్న నడయాడిన నేల**

కులకచర్ల, డిసెంబర్ 14 : ప్రకృతి అందాలను మైమరిపించే పాండవుల బండ వివిధ ప్రాంతాల పర్యాటకులను తన అందాలతో మురిపిస్తున్నది. ఎత్తైన కొండలు, జాలువారే సెలయేరు, పక్కనే ఎప్పుడు నిండు కుండలా కనబడుతున్న చెరువు, కండ్లకు కట్టినట్లుగా కనిపించే ప్రకృతి అందాలు పలువురిని ముగ్దులను చేస్తున్నది. శీతాకాలంలో అడవుల్లో సీతాఫలాలను తీసుకువెళ్లే వారికి ప్రకృతి అందాలు మైమరిపిస్తున్నది. ప్రకృతి అందాలను కళ్లకు వింపుగా కనిపించే ఈ అందాలు కులకచర్ల మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామం నుంచి కిలో మీటర్ దూరంలో పర్యాటకులను అలరిస్తున్నాయి. పాండవుల గుట్ట అందాలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాయి. మండల కేంద్రానికి సుమారు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిర్మలాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో పాండవులగుట్టలు ఉన్నాయి. పాండవుల గుట్ట ప్రాంతానికి వెళ్తే పచ్చనిచెట్లు జాలువారుతున్న జలపాతాలు కనులకు వింపుగా కనిపిస్తున్నాయి. ఈ ప్రాంతాన్నే పండుగల సాయన్న గుట్ట అని పిలుస్తారు. అక్కడే ఒక గుండు వుంది అదే పండుగల సాయన్న గుండు, గద్ద గుండు, గుండు మీద గుండు, నిండుగా పారుతున్న కుంట చూపరుల కంటికి కనబడతాయి. ఇవన్నీ ప్రకృతికి నిలయాలుగా మారుతున్నాయి. ఈ ప్రదేశం చారిత్రాత్మక ప్రదేశాలను తలపిస్తున్నది. విద్యార్థులకు సెలవుల్లో పాండవులగుట్ట విహారయాత్రగా మారింది.



పాండవుల గుట్ట



గుండుకింద పాండవుల గుడి

**పాండవులగుట్ట విశేషాలు**

ద్వాపరయుగంలో జూదంలో ఓడిన పాండవులు వనవాసం చేస్తారు, పాండవులు వనవాసం చేస్తూ ఒక రోజు ఈ గుట్ట వద్ద నిద్రించారని, అందువల్లే ఈ గుట్టకు పాండవుల గుట్టగా పేరుగాంచినదని గ్రామ పెద్దలు చెబుతుంటారు. రాత్రి నిద్రించి అక్కడే భజనలు చేశారని చెబుతున్నారు. దీనికిగాను ఆ ప్రాంతంలో ఓ కొలను ఏర్పాటు చేశారని చెబుతున్నారు. ఈ నీటి కుంట ఊటనీటిచే ఏర్పడిందని కుంటలో ఎండాకాలం సైతం నీరు నిండుగా ఉంటుంది. చుట్టు పక్కలపొలాల వారు ఇక్కడికి వచ్చి నీరుతాగి వెళుతుంటారు. కుంట నీటిచే ఎప్పుడూ వరి పంటను పండిస్తుంటారు. బండపై నుంచి నీరు జాలువారుతూ చూడటానికి అందంగా కనిపిస్తుంది. కులకచర్ల నుంచి తిర్మలాపూర్ మీదుగా అడవివెంకటాపూర్ గ్రామానికి వెళ్లే దారిలోనే పాండవులగుట్ట ఉంది.

**పండుగల సాయన్న గుండు ప్రత్యేకతలు**

రజాకార్ల హయాంలో ధనిక వర్గాలను గడగడ లాడించిన వ్యక్తి పండుగల సాయన్న.. ఆయన ధనికులను దోసి పేద ప్రజలకు పంచి పెట్టాడని చెబుతుంటారు. పండుగల సాయన్న ఈ ప్రాంతంలో పర్యటించాడని తెలియజేస్తుంటారు. పేదప్రజలకు అండగా నిలిచిన ధీరుడు పండుగల సాయన్న పేదప్రజల పక్షాన నిలిచారు. ధనికుల నుంచి దోచుకొని పేదలకు పెట్టే క్రమంలో పాండవులగుట్టపైన ఒక గుండు ఉంది ఆ గుండు పైనుంచి పండుగలసాయన్న తన కార్యకలాపాలను కొనసాగించారని చెబుతుంటారు. రజాకార్లను ఓ ఊపు ఊపిన అతడి వీరత్వం గురించి మండల ప్రజలు చెబుతుంటారు. రాత్రివేళల్లో దోచుకోవడానికి వెళ్లే ముందు ఈ గుండుపైన దీపం పెట్టి వెళ్లేవాడని గుండుపై పెట్టిన దీపం.. చుట్టూ 15 కిలోమీటర్ల దూరం వరకు కనిపించేదట. పండుగలసాయన్న ఎంతదూరం వెళ్లిన కనిపించే దీపం ఆధారంగా తిరిగి ఆ గుండుపైకి వచ్చేవాడట ఇప్పటికీ ఆ గుండును పండుగల సాయన్న గుండుగా పిలుస్తుంటారు. పండుగల సాయన్న దోచుకున్న ధనాన్ని ఈ గుట్టల ప్రాంతంలో దాచి పెట్టాడని ఇప్పటికీ అక్కడడక్కడ తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం. అందువల్లనే ఈ గుండుకు పండుగల సాయన్న గుండు అంటారు.



పాండవుల గుట్టపై ఉన్న గుండం

**ఎక్కడానికి సాధ్యం కాని గద్ద గుండు**

పైకి వెళ్లడానికి సాధ్యం కాని గద్దగుండు పాండవుల గుట్ట పైనే మనకు కనబడుతుంది. పాండవుల గుట్టకు ఎడమవైపు భాగాన ఉన్న గుట్టపై గద్ద గుండు కనగబడుతుంది. ఈ గుండుపైకి ఎక్కాలని ఎంతోమంది ప్రయత్నించినా ఇప్పటికీ సాధ్యం కాలేదు. గద్దలు ఈ గుండుపై గుంపులు గుంపులుగా ఉండేవని ఈ గుండుపై నుంచే చుట్టు పక్కల గ్రామాలను పసిగట్టేవని పెద్దలు చెబుతుంటారు. గద్ద గుండు నుంచీ పోచమ్మదారి కనబడుతుంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు ఇప్పటికీ పాండవుల గుట్టపైకి వచ్చి వనభోజనాలు చేసి వెళుతుంటారు. ప్రతి సంవత్సరం శీతాకాలంలో చుట్టు పక్కల ప్రాంతాల్లోని విద్యార్థులు వనభోజనానికి వెళ్లి చెట్ల నుంచి సీతాఫలాలు సేకరిస్తూ ఉల్లాసంగా తిరుగుతూ పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ, కేరింతలు కొడుతూ బహు ఉషారుగా ప్రకృతిని ఆస్వాదిస్తూ వనభోజనాన్ని ముగిస్తారు. ప్రకృతికి నిలయాలైన ఈ అందాలను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుంది.

**వేంకటేశ్వరస్వామి గుట్ట ప్రాధాన్యత**

పాండవులగుట్టకు వెళ్లేదారిలో వేంకటేశ్వరస్వామి గుట్ట ఉన్నది. రజాకర్ల హయాంలో ఈ గుట్టపైన వున్న వేంకటేశ్వరస్వామి గుడిలోని విగ్రహాన్ని ధ్వంసం చేశారని పెద్దలు చెబుతున్నారు. ఇప్పటికీ భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని పూజలు చేస్తుంటారు. ఇక్కడ స్వామీజీకి ఇప్పటికీ మాంసంతోనే నైవేద్యం పెడుతుంటారు. మేకలు, గొర్రెలు, కోళ్లను బలిచ్చి పూజలు చేస్తుంటారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు కూడా పాండవుల కొండను చూసివెళుతుంటారు. ప్రకృతి అందాలైన పాండవుల కొండలను ప్రభుత్వం అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైన ఉన్నది.



వేంకటేశ్వరస్వామి గుట్ట

**పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి**



పాండవుల గుట్ట ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి. ప్రకృతిలో ఆహ్లాదాన్ని నింపే ఈ గుట్ట పలువురిని ముగ్దులను చేస్తున్నది. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేయాలి. చరిత్రను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. గుట్ట ప్రాంతాన్ని ప్రభుత్వం గుర్తించి ఇంకా అభివృద్ధి చేస్తే చుట్టూ పక్కల గ్రామాల ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే పర్యాటక ప్రదేశంగా ఉంటుంది.

**- గుండుమల్ల నర్సింహులు, తిర్మలాపూర్ కులకచర్ల మండలం**

**ప్రకృతిని ఆస్వాదించవచ్చు..**



కులకచర్ల మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామ పరిధిలోని పాండవుల గుట్ట ప్రాంతం పచ్చగా ఉంటూ ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తుంది. కొండపైన కొంతసేపైన విహరించాలని ప్రతి ఒక్కరికీ అనిపిస్తున్నది. పాండవులు నడయాడిన గుట్ట కావున పాండవుల బండగా పిలువబడుతున్నది. శీతాకాలంలో సీతాఫలాల కోసం చాలామంది వచ్చి కొంతసమయాన్ని గడిపివెళుతారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులు కూడా పిక్నిక్‌వచ్చి వెళుతుంటారు. ప్రకృతిలో కాస్త సమయాన్ని గడపడం వలన ప్రశాంతత లభిస్తుంది.

**- రాములు, తిర్మలాపూర్**

# లాభాల పంట.. బొప్పాయి

**డ్రిప్ పద్ధతిలో బొప్పాయి పంట సాగు**
**మక్కువ చూపుతున్న రైతులు**

యాచారం, డిసెంబర్ 14 : మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు బొప్పాయి పంటపైన దృష్టి సారిస్తున్నారు. మార్కెట్‌లో బొప్పాయి పండ్లకు మంచి గిరాకీ ఉండటంతో రైతులు ఈ పంట సాగు చేయడం ఇందుకు కారణం. మండలంలోని చౌదరిపల్లి, గడ్డమల్లయ్యగూడ తదితర గ్రామాల్లో రైతులు బొప్పాయి పంటను సాగుచేస్తున్నారు. ఈ ప్రాంతం పండ్లతోటలకు అనువైనది కావడంతో అదేవిధంగా తక్కువ నీటితో ఎక్కువ లాభాలు పొందవచ్చునని రైతులు కూరగాయల సాగుతోపాటు బొప్పాయి తోటపైదృష్టి పెట్టారు. బొప్పాయి తోట డ్రిప్ పద్ధతిలో సాగుచేస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని నిరూపిస్తున్నారు. ప్రయోగాత్మకంగా ఈ సాగు మంచి ఫలితాలు ఇస్తుండటంతో పలువురు రైతులు బొప్పాయి సాగుపై దృష్టి పెట్టారు. మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో డ్రిప్‌తో బొప్పాయి పంటను సాగుచేస్తే ఫలితాలు అధికంగా వస్తాయని వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు దీంతో గ్రామానికి చెందిన రైతు కాశమల్ల రాములు 3 ఎకరాల్లో బొప్పాయి సాగును చేపట్టారు. తేవాన్‌రెడ్‌లేడ్ విత్తనాలను నలభై రోజుల పాటు నాటి మొలకలు వచ్చే వరకు రైతులు పలు జాగ్రత్తలు తీసుకుంటారు. బొప్పాయి పంట ఆరు నెలల నుంచే దిగుబడి వస్తుందని అధిక ఆదాయం ఉండటంతో బొప్పాయి పంట సాగుతో ఆర్థిక లాభాలు పొందవచ్చు. ఉద్యానవనశాఖ అధికారిణి కనకలక్ష్మి అందించిన సలహాలు, సూచనలు..

**బొప్పాయి సాగు విధానం..**

బొప్పాయి పంట సాగుకు మిట్టనేలలు అనుకూలం. ఈ నేలలను బాగా దున్నుకొని డ్రిప్ పైపులను అమర్చుకోవాలి. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు వందశాతం సబ్సిడీ ఇవ్వగా, బీసీలకు 90శాతం సబ్సిడీలతో డ్రిప్‌ను అందజేస్తుంది. ప్రతి ఆరు అడుగులకు ఒక అడుగు లోతు గుంత తొవ్వాలి. అందులో ముందుగా ఆవు ఎరువును వేసి వారం పదిరోజులు మగ్గనివ్వాలి. తరువాత అందులో మొక్కలు నాటాలి. నాటిన మూడు రోజులకు నీరు అందించాలి. నాలుగురోజులకోసారి నీటితో మొక్కలను తడిపితే సరిపోతుంది. పిందె దశలో ఒకరోజు తప్పి ఒకరోజు నీరందిస్తే ఆరు నెలల్లో బొప్పాయి పంట దిగుబడి ప్రారంభం అవుతుంది. సంవత్సరం పాటు బొప్పాయి పంట కోతకు వస్తుంది. ప్రతి చెట్టుకు బొప్పాయి పదిరోజులకు ఒక్కసారి రైతు తెంపి మార్కెట్‌కు తరలిస్తారు. మార్కెట్‌లో పెద్దసైజులో ఉన్నబొప్పాయికి మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది.



**బొప్పాయి పంటపై సస్యరక్షణ చర్యలు**

మంచాలలో థైవాన్‌హైబ్రీడ్ రకాల బొప్పాయి పంటలను సాగుచేస్తున్నారు. బొప్పాయి సాగులో రైతులు కనీస జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. భూమిని ముప్పైనుంచి నలభైమీటర్ల లోతుకు దున్నాలి. మొక్కకు మొక్కకు మధ్యన 1.8మీటర్ల దూరం వుండేటట్లు గుంతలు తీయాలి. మొక్కనాటే పదిహేను రోజుల ముందు 5కిలోల పశువుల ఎరువు, కిలో వేపపిండి, ఇరవైగ్రాముల అజోస్పిరిల్లం, రెండువందల గ్రాముల ఫాస్ఫోబ్యాక్టీరియా వేసి బాగా కలిపి గుంత నింపుకోవాలి. తేలికపాటి నేలలో బొప్పాయిలో జింక్, బోరాన్‌దాతువు లోపం ఎక్కువ కనిపిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము బోరాక్స్, రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారీ చేసుకోవాలి. మొక్క మొదలు దగ్గర నీరు తగలకుండా, నీరు నిల్వ ఉండకుండా పిల్లపాదులు తయారుచేసి నీరును పారించాలి. మొక్కచుట్టూ నీరు నిల్వ ఉంటే కుళ్లిపోయి పంటకు నష్టం వాటిల్లుతుంది. అందుకే మొక్కచుట్టూ నీరు నిల్వ ఉండకుండా రైతులు చూసుకోవాల్సి ఉంటుంది. నవంబర్ నెలలో ఆకులపై గోధుమ వర్ణపు మొక్కలు ఏర్పడి ఆకులు పసుపు రంగుగా మారి రాలిపోతాయి. దీనికి గాను లీటరు నీటికి మాంకో జెబ్ 2.5గ్రాములు పదిహేను రోజుల వ్యవధిలో రెండు దఫాలుగా పంటపై పిచికారీ చేయాలి. బొప్పాయిలో పదిహేను రోజులకోసారి మందులను పిచికారీ చేయాల్సి ఉంటుంది. చెట్లు పూతకు వచ్చే వరకు క్రిమికీటకాల భారీనుంచి కాపాడేందుకు ఫాంటాక్, టాటామిడా, ఎఫ్4, బోరాన్ మందులను పిచికారీ చేయాలి. పంట కాపుకు వచ్చిన తరువాత తోటకు పిండినల్లి, రాకుండా మందులను పిచికారీ చేసుకోవాలి.



**బొప్పాయి పంట సాగుపై ఖర్చులు, ఆదాయం..**

ఎకరా నేలను సాగు చేస్తే రెండువేలు ఖర్చవుతుంది. పేడ, ఎరువు పది లోడ్లకు ఇరవై వేల రూపాయల ఖర్చు అవుతుంది. ఎకరాకు పదమూడు వేల మొక్కలు అవసరవుతాయి. ఒక్కొక్క మొక్కకు పదిరూపాయల చొప్పున పదమూడు వేల రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది. గుంతలు తవ్వడానికి, మొక్కలు నాటడానికి పద మూడువేలు, రెండు నెలలకు ఒకసారి ఎరువులకు ఇరవైవేల రూపాయలు ఖర్చు అవుతుంది. కలుపుతీతకు పదివేలు, మందుకు పదిహేను వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని, అదేవిధంగా డ్రిప్‌తో కలిపి మొత్తం దాదాపు లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుందని చెప్పారు. మొక్కలు నాటిన ఆరు నెలల నుంచే బొప్పాయి పండ్ల దిగుబడి ప్రారంభం అవుతుంది. ప్రతి పదిరోజులకోసారి బొప్పాయి పండ్లను తీసి మార్కెట్‌కు తరలిస్తారు. బొప్పాయి సాగుపై రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే ఏడాదికి ముప్పై టన్నుల వరకు దిగుబడి వస్తుంది. నగరంలోని కొత్తపేట పండ్ల మార్కెట్‌లో ఒక కిలో బొప్పాయి ధరకు ఇరవైనుంచి ముప్పై రూపాయల వరకు ధర వస్తుందని సంవత్సర కాలం మొత్తం బొప్పాయి పంట రైతులకు లాభాలు తెచ్చిపెడుతుంది. రైతుకు ఒక ఎకరాకు లక్ష రూపాయలు ఖర్చు చేస్తే లాభాలు మాత్రం మూడింతలుగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

**అధిక లాభాలు పొందొచ్చు**



వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనల మేరకు బొప్పాయి పంట సాగుచేయడంతో లాభాలను తెచ్చి పెట్టింది. నేను ఐదు సంవత్సరాల నుంచి బొప్పాయి పంటసాగును చేపట్టాను. బొప్పాయి సాగు మధ్యలో కూరగాయల తోటలను కూడా సాగుచేయడంతో రెండు విధాలా లాభాలు వస్తున్నాయి.

**- కాశమల్ల రాములు, రైతు చౌదర్‌పల్లి**